సనత్‌నగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో టీడీపీ నాయకులు

సనత్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం నాయకులు శ్రీపతి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ స్వామిటాకీస్ వద్ద టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, పార్లమెంట్ కన్వీనర్ సాయిబాబా పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురికి పార్టీ సభ్యత్వాలు అందజేశారు. కార్యక్రమంలో కె. జయశ్రీ, రాజేంద్రప్రసాద్, బి.శ్రీనివాస్‌గౌడ్, మురహరిగౌడ్, మల్లేష్, ప్రసాద్, పృథ్వీరాజ్, శ్రీను, విజయలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఎన్యూమరేటర్లు

బంజారాహిల్స్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విజ్ఞప్తి చేశారు. సర్వేలో భాగంగా జీహెచ్‌ఎంసి సిబ్బంది బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి వివరాలు సేకరించి ఇంటికి స్టిక్కర్ అంటించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ కుటుంబ సర్వేతో కులగణన సాధ్యం అవుతుందని, అసలు లెక్కలు వెలుగులోకి వస్తాయన్నారు. సర్వే వల్ల బడుగు, బలహీన వర్గాలకు తగిన న్యాయం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి సర్వేలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించి పూర్తి వివరాలను అందించాలని సూచించారు.

35 వేల ఇళ్లకు కుటుంబ సర్వే స్టిక్కర్లు

ఖైరతాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వేలో భాగంగా ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో 18వేల ఇళ్లను, జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధి లో 17,500ల ఇళ్లకు ఎన్యూమరేటర్లు గురువారం స్టిక్కర్లను అంటించారు. శనివారం నుంచి ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తామని ఎన్యూమరేటర్లు సూచించారు.

సర్వే సిబ్బందికి సమాచారమివ్వండి

బోరబండ, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే సిబ్బందికి ప్రజలందరు సమాచారం ఇవ్వాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. గురువారం బోరబండ సైట్-1 తుర్రెబాజ్ ఖాన్ కమ్యూనిటీ హాల్లో ఎన్యూమరేటర్లకు అవగాహన సమీక్ష జరిగింది. కార్పొరేటర్ మాట్లాడుతూ ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో కుటుంబ సభ్యులందరి వివరాలు సిబ్బందికి చెప్పి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్-19 డిప్యూటి కమిషనర్ జకియ సుల్తానా, టీపీవో వెంకటకిషన్‌రావు, వార్డు ఇన్‌చార్జి విశ్వపతి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్, పక్కన డిప్యూటి కమిషనర్ జకియ సుల్తానా

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు: ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చెప్పారు. ఎర్రగడ్డలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో బాలానగర్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ఆర్‌ఐలు నాగమణి, దేవా, సంతోష్, ఎర్రగడ్డ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



దివంగత ప్రముఖ నటి శ్రీదేవి కుమార్తె సినీ నటి జాన్వీ కపూర్ గురువారం వెంగళరావునగర్ డివిజన్ మధురా నగర్‌కి విచ్చేశారు. శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం బయట ఆమెతో సెల్ఫీలు, ఫొటోలు దిగడానికి స్థానికులు పోటీ పడ్డారు.

-పంజాగుట్ట, 7(ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

బంజారాహిల్స్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లోని ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని, అక్కడ 'ఇది ప్రభుత్వ స్థలమంటూ' సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే.. కొన్నేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ప్రముఖ సంగీత దర్శకుడు చక్రవర్తికి 20 గుంటల స్థలాన్ని గజం రూ. 8,500లకు కేటాయించింది. అందులో రికార్డింగ్, నాన్ రికార్డింగ్ స్టూడియో ఏడాదిలోపు నిర్మాణాలు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

చక్రవర్తి కుటుంబం గడువులోగా స్థలంలో ఎలాంటి స్టూడియో ఏర్పాటు చేయలేదు. దాంతో రెవెన్యూ అధికారులు గురువారం స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఆ స్థలంపై కోర్టులో వివాదం కూడా నడుస్తుంది. స్థలం వద్ద సూచిక బోర్డును ఏర్పాటు చేసిన అధికారుల ఇతరులు ప్రవేశించడానికి వీలు లేదని హెచ్చరికలు జారీచేశారు.

లింక్ పంపి రూ.1.45 లక్షలు దోచేశారు

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ ఆర్డర్ చేసి, క్యాన్సిల్ చేసిన మహిళను సంప్రదించిన సైబర్‌నేరగాళ్లు, ఏపీకే లింక్‌ను పంపి రూ.1.45 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన గృహిణి(38) జెప్టో యాప్‌లో ఆహార పదార్థాలు ఆర్డర్ పెట్టింది. కొద్దిసేపటి తర్వాత ఆర్డర్‌ను క్యాన్సిల్ చేసింది. వెంటనే ఆమెను సంప్రదించిన సైబర్ నేరగాడు జెప్టో సంస్థ ప్రతినిధిని అని చెప్పుకున్నాడు. మీరు క్యాన్సిల్ చేసిన ఆర్డర్ డబ్బు మీ ఖాతాలో జమకాకుంటే ఏమి చేయాలో వీడియో కాల్‌లో చెబుతూ స్ర్కీన్ షేరింగ్ చేయాలని సూచించాడు. అంతేకాకుండా లింక్‌ను పంపి అందులో వివరాలు నమోదు చేయాలని చెప్పాడు. లింక్‌ను తెరిచి ఆమె వివరాలు నమోదు చేసిన తర్వాత బ్యాంకు వివరాలు నమోదు చేయాలని కోరాడు. ఆమెకు అనుమానం వచ్చినా ఓటీపీ రాకుండా డబ్బు ఎక్కడికీ పోదు అన్న ధీమాతో క్రెడిట్ కార్డు వివరాలు నమోదు చేసింది.అయినా అనుమానంతో బ్యాంకు అధికారులను సంప్రదించి కార్డును బ్లాక్ చేయాలని సూచించింది. కానీ సైబర్ నేరగాళ్లు పంపిన లింక్ ద్వారా మొబైల్‌ను హ్యాక్ చేసి, ఆమెతో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న సమయంలోనే క్రెడిట్ కార్డు నుంచి రూ. 1.45 లక్షలు వేరే ఖాతాకు బదిలీ చేశారు. దాంతో బాధితురాలు వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేవంత్ సర్కార్‌పై యుద్ధం తప్పదు: మందకృష్ణ

ఖైరతాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్‌పై యుద్ధం తప్పదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రకటించారు. ఖైరతాబాద్ మోడ్రన్ ఫంక్షన్‌హాల్‌లో హైదరాబాద్ జిల్లా మాదిగల ధర్మయుద్ధ సదస్సు ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు టివి నరసింహమాదిగ అధ్యక్షతన గురువారం జరిగింది. హాజరైన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కేంద్రంలో, రాష్ట్రంలో మాలల ఆధిపత్యం నడుస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎస్సీ వర్గీకరణ చేయాలని ఉన్నా, పార్టీలోని కొందరు అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణను అమలుపరచుకునేందుకు మరో యుద్ధానికి మాదిగలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, నగరంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి'

పంజాగుట్ట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబసర్వేలో కుల, మత రహితుల వివరాల సేకరణ కోసం ప్రత్యేకంగా ఒక కాలం పెట్టాలని, హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కులనిర్మూలన సంఘం డిమాండ్ చేసింది. తాము సమగ్ర కుటుంబ సర్వేకు వ్యతిరేకం కాదని, మా లెక్కలు కూడా తీయాలని సంఘం సలహాదారు సీఎల్ఎన్ గాంధీ, అధ్యక్షుడు ఎండీ వాహీద్, గౌరవ అధ్యక్షురాలు గుత్తా జ్యోత్స్న అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గడిచిన 53 ఏళ్లుగా కుల, మత రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామన్నారు.

'ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి'

పంజాగుట్ట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మద్దతుతో ఎమ్మెల్సీగా గెలిచిన చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న)ను అదుపులో పెట్టాలని భువనగిరి నియోజకవర్గ వాసి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గూడూరు నిఖిల్ రెడ్డి కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పరువు తీసేలా మాట్లాడుతున్న మల్లన్నపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో యాదవ, కురుమలకు చోటివ్వాలి

- జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రాములు

పంజాగుట్ట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 20 శాతం జనాభా ఉన్న యాదవ, కురుమ సామాజికవర్గానికి మంత్రివర్గంలో చోటివ్వాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. తమ ఓట్లతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమను విస్మరిస్తోందని ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి వంశీమోహన్ యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. యాదవ, కురుమ సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని, మూడు ఎమ్మెల్సీ, ఐదు కార్పోరేషన్ ఛైర్మన్ పదవులు ఇవ్వాలన్నారు. యాదవ కార్పోరేషన్‌కు పాలకమండలిని ఏర్పాటు చేసి రూ.5 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీనివాస్‌యాదవ్, వెంకట్రామ నర్సయ్య, రాములు యాదవ్, బి.శ్రీనివాస్ యాదవ్, జి.ఐలేష్‌యాదవ్, రవియాదవ్,లక్ష్మి, మంజులాయాదవ్, ఎం.శ్రీశైలం యాదవ్, కిరణ్ యాదవ్, రామకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

తెలంగాణ ఐఎంఏ అధ్యక్షుడిగా

రేపు ద్వారకానాథ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం



బంజారాహిల్స్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ దువ్వూరు ద్వారకనాథ్‌రెడ్డి ఈ నెల 9న బాధ్యతలు స్వీకరించనున్నారు. శనివారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఐఎంఏ నార్త్ బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేంద్రనాథ్ తెలిపారు.

సమ్మర్ డిమాండ్‌ను తట్టుకునేలా చర్యలు చేపట్టాలి: సీఎండీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవిలో ఏర్పడే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా పంపిణీ, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను మెరుగుపర్చాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అధికారులకు సూచించారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం తెలంగాణ ట్రాన్స్‌కో డైరెక్టర్ (ట్రాన్స్‌మిషన్) జగత్‌రెడ్డి, ఇతర ఇంజినీర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. సీఎండీ ఫరూఖీ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వేసవిలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో నమోదవుతుందని, గతేడాది 3,756 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ డిమాండ్, ఈ ఏడాది దాదాపు 16శాతం వృద్ధితో 4,352 మెగావాట్లుగా నమోదైందన్నారు. గతేడాది 81.39 మిలియన్ యూనిట్లుగా ఉన్న వినియోగం దాదాపు 12 శాతం వృద్ధితో 90.68 మిలియన్ యూనిట్లకు చేరిందన్నారు. 2025 వేసవిలో సైతం విద్యుత్ డిమాండ్ గతం కంటే ఎక్కువగా రికార్డుస్థాయిలో ఉండే అవకాశముందన్నారు. గ్రేటర్ శివారు ప్రాంతాలైన నెమలినగర్, గోపన్‌పల్లి, కోకాపేట్, కోహెడ, తట్టి అన్నారం, అబ్దుల్లాపూర్‌మెట్, మాన్సాన్‌పల్లి, అజీజ్‌నగర్, కందుకూరు, కే.సింగారం, మల్లాపూర్, వాయుపురి, ఉప్పల్ భగాయత్, దుండిగల్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోందన్నారు. ఆయా ప్రాంతాల్లో అవసరానికి తగ్గట్టుగా 220/132/ 33 కేవీ సబ్ స్టేషన్ల ఏర్పాటు, ఇతర నెట్వర్క్‌ను పటిష్ఠం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సీఎండీ సూచించారు. సమీక్షలో టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) డాక్టర్ నర్సింహులు, టీఎల్ఎస్ఎస్ చీఫ్ ఇంజినీర్ రాంజీ తదితరులు పాల్గొన్నారు.

భరించలేకపోతున్నాం.. సెలవులు ఇవ్వండి

- బోయగూడ నర్సింగ్ హాస్టల్‌లో డ్రైనేజీ కంపు
- గాంధీ ఆస్పత్రిలో నర్సింగ్ విద్యార్థినుల ఆందోళన
- డ్రైనేజీ పైప్‌లైన్‌లు పగిలి నెలరోజుల నుంచి ఇదే పరిస్థితి
- పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం
- గాంధీలో 8వ అంతస్తులో నర్సులకు వసతి ఏర్పాట్లు



గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారికి సమస్యలు చెప్పుకుంటున్న నర్సింగ్ విద్యార్థినులు

అడ్డగుట్ట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ పైపలైన్ పగిలిపోయి వస్తున్న దుర్గంధంతో బోయగూడ నర్సింగ్ హాస్టల్‌లో ఉండలేకపోతున్నామని నర్సింగ్ విద్యార్థినులు గురువారం గాంధీ ఆస్పత్రిని చుట్టుముట్టారు. పరీక్షలు దగ్గరికి వస్తున్నాయని, దుర్వాసన కారణంగా సరిగ్గా చదువుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సెలవులు ఇవ్వాలని వారు కోరారు. గాంధీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న 130 మంది నర్సింగ్ విద్యార్థినులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వెనుక వైపు ఉన్న బోయగూడలోని హాస్టల్ ఉంటున్నారు. ఆరునెలల నుంచి హాస్టల్‌లో పరిస్థితి దయనీయంగా మారడంతో గాంధీ ఆస్పత్రిని చుట్టుముట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల నుంచి డ్రైనేజీ దుర్గంధ సమస్య ఉందని, వాసన కారణంగా సరిగ్గా తినలేకపోతున్నామని తెలిపారు. దీనిపై పలుమార్లు గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి, నర్సింగ్ సూపరింటెండెంట్‌లతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని నర్సులు చెప్పారు. చివరికి హాస్టల్ నుంచి 2 కి.మీల దూరం నడుచుకుంటూ వచ్చి ఆస్పత్రిని చుట్టుముట్టామని, తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేసేవరకు ఇక్కడే ఉంటామని స్పష్టం చేశారు. దీంతో దాదాపు మూడు గంటల పాటు ఆస్పత్రి ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బోయగూడ హాస్టల్ బాలేకపోతే గాంధీ ఆస్పత్రిలోని 8వ అంతస్తులో నర్సులు ఉండవచ్చని సూపరింటెండెంట్ రాజకుమారి, ఆర్ఎంఓ 1, నర్సింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌కు చెప్పారు. అయితే ఆ గదులు దుమ్ముతో నిండి ఉన్నాయని, ఈ విషయాన్ని ప్రత్యక్షంగా చూపిస్తామని నర్సులు లిఫ్టు ద్వారా 8వ అంతస్తుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, లిఫ్టు ఎక్కకుండా జీడీఎక్స్ సెక్యూరిటీ గార్డులు అడ్డుకుని, ఆడ పిల్లలు అని చూడకుండా బయటికి ఈడ్చుకొచ్చారని, ఆగ్రహం వ్యక్తం చేశారు. జీడీఎక్స్ సెక్యూరిటీ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, నర్సుల గొడవ చేయడంతో గాంధీలోని 8వ అంతస్తును శుభ్రం చేయించారు.

పరీక్షలకు వారం ముందే సెలవులిస్తాం: సూపరింటెండెంట్

గాంధీలో విధులు నిర్వహిస్తున్న నర్సులకు ఈనెల 28 నుంచి పరీక్షలు ఉన్నాయని, నిబంధనల ప్రకారం పరీక్షలకు వారం రోజుల ముందు మాత్రమే సెలవులు ఇస్తామని, అంతకంటే ఎక్కువ రోజులు సెలవులు ఇచ్చేది లేదని సూపరింటెండెంట్ స్పష్టం చేశారు. నర్సులు ఇంటికి వెళ్లాలనే ఉద్దేశంతోనే రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. బోయగూడ నర్సింగ్ హాస్టల్‌ను బాగు చేయడానికి కొద్ది రోజుల క్రితం రూ.40 లక్షల నిధులు మంజూరు అయ్యాయని త్వరలో హాస్టల్ మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

సీబీఐ అధికారినని బెదిరించి..

ప్రభుత్వ ఉద్యోగి నుంచి రూ.48 లక్షలు స్వాహా

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాను సీబీఐ అధికారినని, మీ బ్యాంకు ఖాతాల్లో అక్రమ లావాదేవీలు జరిగాయంటూ సైబర్ నేరగాళ్లు ఓ ప్రభుత్వ ఉద్యోగిని బోల్తా కొట్టించారు. తాము చెప్పినట్లు వినకుంటే అరెస్టు తప్పదంటూ బెదిరించి రూ.48 లక్షలను తమ ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి (55)కి సైబర్ నేరగాడు ఫోన్ చేశాడు. 'తాను సీబీఐ అధికారిని. మీ పేరుతో ఢిల్లీ బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు అక్రమ లావాదేవీలు జరిగాయి. దీనిపై మనీలాండరింగ్ కేసులు నమోదయ్యాయి. అరెస్టు తప్పదు. మనీలాండరింగ్ కేసు నమోదైతే ఉద్యోగం పోవడంతోపాటు కుటుంబసభ్యులకూ ఇబ్బందులు వస్తాయి. మీ ఇంటి చుట్టూ సివిల్ దుస్తుల్లో సీబీఐ అధికారులు ఉన్నారు. మేం చెబితే ఏ క్షణంలోనైనా అరెస్టు చేస్తారని' బెదిరించాడు. అదే ఫోన్‌కాల్‌లో ఈడీ అధికారి అంటూ మహిళ రంగప్రవేశం చేసి సదరు ఉద్యోగిని గందరగోళానికి గురిచేయడంతో పాటు ఆదాయం, బ్యాంకు ఖాతాలు, అందులో ఉన్న నగదు వివరాలు సేకరించింది. గంటగంటకు వీడియోకాల్ చేసి, తమతో కాంటాక్ట్‌లో ఉండాలని సూచించింది. మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును ఆర్‌బీఐ ఖాతాకు పంపి మీ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని, సుప్రీంకోర్టులో విచారణ తర్వాత మీ డబ్బు తిరిగి పంపుతామని సైబర్ నేరగాళ్లు చెప్పారు. ఇదంతా నిజమేనని నమ్మిన ఆ ఉద్యోగి.. వారు సూచించిన ఖాతాల్లోకి రూ.48 లక్షలు ఆర్‌టీజీఎస్ ద్వారా పంపారు. తర్వాత వారి ఫోన్లు పని చేయకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశారు.



ఛట్ పూజలో ఉత్తర ప్రాంతీయులు

ఘనంగా ఛట్ పూజలు

ఖైరతాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని హుస్సేన్‌సాగర్ గంగమ్మ దేవాలయం, బతుకమ్మ ఘాట్ వద్ద ఉత్తర ప్రాంతీయులు జరుపుకునే ఛట్ పూజలు వైభవంగా జరిగాయి. ఈ మేరకు గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు సంప్రదాయ బద్ధంగా జరిగిన పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఛత్ పూజల సందర్భంగా హెచ్ఎండీఏ ప్రత్యేక ఏర్పాట్లతో పాటు సాగర్‌లో బోట్లతో సెక్యూరిటీ సిబ్బందితో చర్యలు చేపట్టారు.

బ్యాంక్ మేనేజర్ చేతివాటం

4.80 కోట్లకు టోకరా

(5వ పేజీ తరువాయి)

మోసం జరిగినట్లు గుర్తించి కేసును ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు. ఈ కేసును పూర్తిగా దర్యాప్తు చేసిన ఈవోడబ్ల్యూ అధికారులు బ్యాంకు మేనేజర్‌తోపాటు మరికొందరు కలిసి ముఠాగా ఏర్పడి భారీస్థాయిలో మోసం చేసినట్లు గుర్తించారు. నకిలీ ధ్రువపత్రాలతో రుణం తీసుకున్న వారితోపాటు నకిలీపత్రాలు సమకూర్చిన వారిని అరెస్టు చేశారు. వీరంతా బ్యాంకు మేనేజర్ కార్తీక్‌రాయ్‌తో కలిసి మోసానికి పాల్పడ్డారని, నకిలీపత్రాలతో రుణాన్ని మంజూరు చేసినందుకు బ్యాంకు మేనేజర్ 5 శాతం కమీషన్ తీసుకునేవాడని దర్యాప్తులో తేలింది. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ ఉద్యోగుల పేరుతో నకిలీపత్రాలు, పేస్లిప్పులతో మట్టేపల్లి శ్రీకాంత్ రూ.15 లక్షలు, పోలె విశాల్ మరో రూ.15 లక్షల చొప్పున రుణం తీసుకున్నారు. వీరికి నకిలీపత్రాలు సమకూర్చడంలో దాగల రాజు, శుధాంశు శేఖర్ పరిదా, ఎండీ వాజిద్, సునీల్‌కుమార్, భాస్కర్‌గౌడ్, ఆమంచి ఉపేందర్ సహకరించారని గుర్తించారు. వీరంతా 2022 నుంచి 2023 వరకు రూ.4.80 కోట్లు కాజేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

చనిపోయిన వారి ఖాతాల్లో డబ్బు కూడా..

కార్తీక్‌రాయ్ తన అధికారాన్ని దుర్వినియోగం చేసి పలుమార్గాల్లో డబ్బు కాజేశాడు. బ్యాంకు ఖాతాదారులకు తెలియకుండా వారి లోన్‌పై టాప్ అప్ తీసుకొని, ఇతర ఖాతాలకు మళ్లించాడు. ఖాతాదారుల ఫిక్స్‌డ్ డిపాజిట్ల సొమ్మును వేరే ఖాతాలకు బదిలీ చేశాడు. బ్యాంకు ఖాతాదారులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబసభ్యులకు తెలియకుండా ఖాతాలో డబ్బు కాజేసేవాడు. బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులకు మ్యూచువల్‌ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే పెద్దమొత్తాల్లో లాభాలు వస్తాయని నమ్మించి పెట్టుబడి పేరుతో డబ్బులు వసూలు చేసి సొంత ఖాతాలో జమ చేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

స్పెషల్ డ్రైవ్‌లో.. 50 వేల మ్యాన్‌హోల్స్ శుభ్రం

- 700 కిలోమీటర్ల పైపులైన్‌కు డీ-సిల్టింగ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సివరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్ లక్ష్యంగా వాటర్‌బోర్డు చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో గురువారం వరకు 50 వేల మ్యాన్ హోల్స్ శుభ్రం చేశారు. దీంతో పాటు 6,140 ప్రాంతాల్లో 700 కిలో మీటర్ల మేర సివరేజ్ పైపులైన్లను డీ-సిల్టింగ్ పనులు నిర్వహించారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రారంభమైన ఈ స్పెషల్ డ్రైవ్‌లో మొదట అధికంగా ఫిర్యాదులు వచ్చే ప్రాంతాలను ఎంపిక చేసుకొని మ్యాన్ హోల్స్, సివరేజ్ లైన్లను శుభ్రం చేస్తున్నారు. ఇందులో ఎయిర్‌టెక్, మినీ ఎయిర్‌టెక్ మిషన్లు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. రోజువారీగా వాటర్‌బోర్డుకు వచ్చే ఫిర్యాదులను పరిష్కారం చేయడంతో పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా బాధ్యతలను అప్పగించారు. ఈ ప్రక్రియ విజయవంతంగా సాగుతుండడంతో 90 రోజుల స్పెషల్ డ్రైవ్ తర్వాత కూడా కొనసాగించేందుకు వాటర్‌బోర్డు చర్యలు చేపడుతోంది. స్పెషల్ డ్రైవ్‌లో 50వేల మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయడం పట్ల అధికారులు, సిబ్బందిని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి అభినందించారు. ఇదే స్ఫూర్తి రాబోయే రోజుల్లోనూ కొనసాగించాలని సూచించారు.

రూ. 200 కోట్ల మద్యం సరఫరాకు బ్రేక్

- సాంకేతిక సమస్యతో ఇబ్బందులు.. పరిష్కరించిన అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్వర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య వల్ల మంగళ, బుధవారాల్లో మద్యం డిపోల నుంచి వైన్ షాపులకు వెళ్లాల్సిన మద్యం సరఫరా నిలిచిపోయింది. దాంతో రోజుకు రూ.100కోట్ల చొప్పున.. రెండు వందల కోట్ల రూపాయల విలువైన మద్యం సరఫరాకు బ్రేక్ పడింది. ఎక్సైజ్ అధికారులు వెంటనే స్పందించి టెక్నికల్ టీమ్ సహకారంతో సమస్యను పరిష్కరించడంతో గురువారం తెల్లవారుజామున డిపోల నుంచి యథావిధిగా లిక్కర్ సరఫరా జరిగినట్లు అధికారులు తెలిపారు.

లంచగొండి అధికారికి ఏడాది జైలు

- రూ. 20 వేల జరిమానా విధించిన ఏసీబీ కోర్టు

హైదరాబాద్ సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్లాట్ మ్యుటేషన్ చేసేందుకు రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ జీహెచ్ఎంసీ ఉద్యోగికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఏసీబీ కోర్టు తీర్పు వెలువరించింది. జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ 6 కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జిలగం వెంకటేశ్వరరావు, 2013లో ఓ ప్లాట్‌కు సంబంధించి మ్యుటేషన్ చేసేందుకు బాధితుడి వద్ద రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వలపన్నిన ఏసీబీ అధికారులు వెంకటేశ్వరరావు రూ.20 వేల లంచం తీసుకుంటుండగా అరెస్ట్ చేశారు. ఏసీబీ న్యాయస్థానం వెంకటేశ్వరరావుకు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది.

రెండు రోజులు.. 45%

(5వ పేజీ తరువాయి)

ఇంటింటికి స్టిక్కర్లు అంటించే ప్రక్రియ 45 శాతం పూర్తయ్యిందని, రెండు రోజుల్లో 13,35,673 ఇళ్లకు స్టిక్కర్ అంటించినట్లు బల్దియా గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సర్వేలో భాగంగా ఇంటింటికి వెళ్తున్న ఎన్యూమరేటర్లు యజమాని పేరు, మొబైల్ నంబర్ తీసుకొని స్టిక్కర్ అంటించి, 3-4 రోజుల్లో వచ్చి సర్వేకు సంబంధించిన ఫారం ప్రకారం పూర్తి వివరాలు సేకరిస్తామని చెబుతున్నారు. కొన్ని కుటుంబాల్లో భార్యాభర్తలు ఉద్యోగం చేస్తున్న నేపథ్యంలో వారికి ముందస్తు సమాచారమిచ్చేందుకు మొబైల్ నెంబర్ తీసుకుంటున్నామని ఓ అధికారి తెలిపారు. కాగా, స్టిక్కర్లు అంటించే ప్రక్రియ కొన్ని సర్కిళ్లలో నేడు ముగిసే అవకాశం లేదు. స్టిక్కరింగ్ పూర్తయిన చోట నేడు సర్వే మొదలవుతుందని, ఇతర ప్రాంతాల్లో రేపటి నుంచి సమాచార సేకరణ జరుగుతుందని ఓ అధికారి తెలిపారు. సర్వేలో భాగంగా 56 ప్రధాన, 19 అనుబంధ అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు తీసుకోనున్నారు.



వివరాలు అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్

ఇంటింటి సర్వేలో కుటుంబ వివరాలు ఇచ్చిన కలెక్టర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో భాగంగా హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం తన ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లకు వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లో కలెక్టర్, ఆయన కుటుంబసభ్యుల వివరాలు నమోదు చేసిన ఎన్యూమరేటర్లు ఇంటికి సర్వే స్టిక్కర్ అంటించారు.

రైల్వేలో ఎన్నికల కోలాహలం

- దక్షిణమధ్య రైల్వేలో 78,905 ఓట్లు
- 30% వచ్చిన వారికే గుర్తింపు
- పోటాపోటీగా ప్రచారం

చిలకలగూడ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేలో కార్మిక సంఘాల గుర్తింపు కోసం డిసెంబర్ నాలుగు నుంచి ఆరవ తేదీవరకు మూడురోజులు సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని యూనియన్‌లు వాట్సప్, పోస్టర్‌లు, బహిరంగ సభల ద్వారా జోరుగా విస్తృత ప్రచారం చేస్తున్నారు. జోన్ పరిధిలో దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, మజ్దూర్ యూనియన్, దక్షిణమధ్య రైల్వే కార్మిక సంఘ్, ఆల్ ఇండియా పాయింట్స్ మెన్ అసోసియేషన్, రైల్ మజ్దూర్ యూనియన్ నామినేషన్‌లు సమర్పించాయి. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, నాందేడ్ డివిజన్లతో పాటు లాలాగూడ, రాయనపాడు, తిరుపతి వర్క్‌షాపులలో విధులు నిర్వహించే ఉద్యోగులు, కార్మికులు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గెజిటెడ్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకి ఓటు వేసే అవకాశం లేదు. ప్రతి పది సంవత్సరాలకి ఒకసారి ఎన్నికలు నిర్వహించి కార్మిక సంఘాలకి గుర్తింపు జారీ చేస్తాయి. కరోనా తదితర కారణాల వల్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. 2007లో నిర్వహించిన ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ మెదటి స్థానం, ఎంప్లాయీస్ సంఘ్ రెండవ స్థానంలో నిలిచి గుర్తింపు పొందగా 2013లో నిర్వహించిన ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్, మెదటి స్థానం, మజ్దూర్ యూనియన్ గుర్తింపు పొందాయి. మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదిర్శి మూడవ సారి ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తుండగా, ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి ఈసారి తమదే విజయమని ఢంకా మోగించి మరీ చెబుతున్నాడు. ద.మ రైల్వే కార్మిక సంఘ్ తాము కూడా పోటీలో ఉన్నామని విజయం తమదేనని, రైల్ మజ్దూర్ యూనియనే గెలుస్తుందని ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించి మెరుగైన సౌకర్యాల కల్పనకి కార్మిక సంఘాలకి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి అర్హులైన వారికి గుర్తింపు జారీచేసి వారికి ప్రాతినిధ్యం కల్పిస్తుంటారు. గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడుతుంటారు. రైల్వేలో ప్రధాన డిమాండ్ల విషయానికి వస్తే 8వ వేతన సంఘం ఏర్పాటు, ఖాళీ ఉద్యోగాలు భర్తీ, అవుట్ సోర్సింగ్, ప్రైవేటీకరణపై డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల్లో వైట్ కాలర్ ఉద్యోగుల్లో ఎంప్లాయీస్ సంఘ్ పట్టు ఉండగా వర్క్‌షాపులు తదితర విభాగాల్లో పనిచేసే వారిలో మజ్దూర్ యూనియన్ గట్టి పట్టు కలిగి వుండటం వల్ల ఇద్దరికి గుర్తింపు లభిస్తుందని మిగిలిన కార్మిక సంఘాల పోటీ నామ మాత్రమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.


ఎన్నికల ప్రచారంలో ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు


మూడవసారి ఘన విజయం సాధిస్తాం..



డిసెంబర్‌లో నిర్వహించే కార్మిక సంఘాల ఎన్నిల్లో మూడవ సారి భారీ మెజారిటీతో గెలుస్తాం. కార్మికులు, ఉద్యోగులు మా వెంటే ఉన్నారు. విజయవాడ, తిరుపతి, గుంటూర్ తదతర ప్రాంతాలో ఇప్పటికే ప్రచారం పూర్తి చేశాం. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా ఉద్యోగులు, కార్మికుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపడతా.

- సీహెచ్. శంకర్‌రావు, మజ్దూర్ యూనియున్ ప్రధాన కార్యదర్శి

అన్ని జోన్లలో విజయం మాదే



ద.మ రైల్వేతో పాటు భారతీయ రైల్వేలోని అన్ని జోన్లలో ఘన విజయం మాదే. రైల్వే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రైల్వే బోర్డుతో పోరాడుతా. అన్ని డివిజన్లు వర్క్‌షాపులలో మా కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

- మర్రి రాఘవయ్య, ఎన్ఎఫ్ఐఆర్, ద.మ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి

తెల్లారితే పెళ్లి.. వరుడు జంప్

మారేడుపల్లి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): తెల్లారితే పెళ్లి పెట్టుకొని పెళ్లి కొడుకు పరారైన సంఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికంగా ఉండే వధువుకు మాదాపూర్‌కు చెందిన సందీప్‌తో వివాహం నిశ్చయమైంది. రెండు కుటుంబాలు బంధుమిత్రులకు, స్నేహితులకు పెళ్లి పత్రికలను ఇచ్చారు. వరుడికి 10 లక్షల వరకట్నం ఇచ్చారు. తెల్లారితే నగరంలో వివాహం జరగాల్సిఉండగా వరుడు అదృశ్యం కావడంతో వధువు కుటుంబీకులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంతిరత్న విజయ్‌కుమార్‌కు ఓయూ డాక్టరేట్



తార్నాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా లాలాగూడకు చెందిన కంతిరత్న విజయ్‌కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. లా కాలేజీలో ప్రొ. జయకుమార్ పర్యవేక్షణలో 'లా రిలేటింగ్ టు ప్రాబ్లమ్స్ ఆఫ్ ఇంటర్నల్లీ డిస్‌ప్లేస్‌ఎడ్ పీపుల్ అండర్ ది ల్యాండ్ ఆక్విజేషన్ యాక్ట్ 2013- ఏ కేస్ స్టడీ ఆఫ్ మల్లన్న సాగర్ ప్రాజెక్ట్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకుగాను డాక్టరేట్‌ను అందుకున్నట్లు గురువారం ఆయన తెలిపారు. కాగా విజయ్ కుమార్ ప్రస్తుతం హైకోర్టులో న్యాయవాదిగా ఉన్నారు.


హుండీ లెక్కింపులో పాల్గొన్న ఈఓ, సిబ్బంది

అంజన్న ఆలయ హుండీ ఆదాయం రూ.6 లక్షలు

రాంగోపాల్‌పేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సర్దార్‌పటేల్ రోడ్డులోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.6,11,454 ఆదాయం వచ్చింది. 231 రోజులకు గాను ఆలయ ఆవరణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో ఈ ఆదాయం వచ్చింది. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస శర్మ అధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గ్రామీణ క్రీడాకారులను ఆదరించాలి: వసంతకుమార్

అడ్డగుట్ట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్చరీలో గ్రామీణ క్రీడాకారులను ఆదరించే మనస్తత్వం అందరికీ ఉండాలని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్ కుమార్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ సివిల్ కోర్టులోని బార్ అసోసియేషన్ చాంబర్‌లో రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులైన టి.రాజును సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుశీల్ కుమార్, నీలకాంతన్, మన్నన్, సమీర్ కుమార్ పాల్గొన్నారు.


ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుతో ట్రాఫిక్ సమస్యపై చర్చిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

స్ట్రామ్ వాటర్ పైపులైన్ పనులు పరిశీలన

బౌద్ధనగర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లనుంచి జోషి కాంపౌండ్ వరకు చేపట్టిన స్ట్రామ్ వాటర్‌పైపులైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమ, జీహెచ్ఎంసీ, జలమండలి, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారు రూ.17లక్షలతో పనులను చేపడుతున్నామని, తొందరగా పూర్తిచేస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రధాన రహదారిపై రోడ్లు తవ్వాల్సి వస్తే ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసులును కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ కౌశిక్, జలమండలి మేనేజర్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌టీ నుంచి జై భారత్ స్కూల్ వరకు రూ.47 లక్షలతో సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కొలను బాల్‌రెడ్డి, మీర్జా ఖలీల్ బేగ్, రాజేష్ ముదిరాజ్, శిరీష్, దుర్గేష్, భానుప్రసాద్, పురుషోత్తం పాల్గొన్నారు

- సనత్‌నగర్ (ఆంధ్రజ్యోతి)

రైల్వే ట్రాక్ మెన్‌ల ఇబ్బందులపై మిశ్రాకు లేఖ రాశా

- సీహెచ్ శంకర్ రావు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైల్వే రంగంలో బ్రిటీష్ కాలం నాటి మ్యానువల్స్‌తో రైల్వేలో ట్రాక్‌మెన్‌లు ఇబ్బందులు పడుతున్నారని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్ రావు అన్నారు. వారి ఇబ్బందులపై ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ శివగోపాల్ మిశ్రాకు లేఖ రాశానని ఆయన తెలిపారు. గురువారం సికింద్రాబాద్ రైల్వే మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వే రంగంలో వెంటనే ట్రాక్‌మెన్ వర్కింగ్ మ్యానువల్స్ మార్పి ట్రాక్‌మెన్ డ్యూటీ రోస్టర్ పని గంటలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఏఐఆర్ఎఫ్ మిశ్రాకు లేఖలో పేర్కొన్నారు. మిశ్రాకు లేఖ రాయడం పట్ల రైల్వే రంగ కార్మికులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారని తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు : ఇన్‌స్పెక్టర్

తిరుమలగిరి నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు హెచ్చరించారు. గురువారం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టెషన్ ముందు వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులు కల్పిస్తాం

- సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీ గణేష్


లాల్‌బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గురువారం లాల్‌బజార్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్లంబింగ్ వర్క్, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్స్ కోసం తన సొంత నిధులను అందజేశారు. రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మురళీ ముదిరాజ్, నాగనేని సరిత, అరవింద్ గౌడ్, భవాని, యూత్ కాంగ్రెస్ నాయకులు నీరజ్, సుధీర్, రాకేష్, సుధాకర్ పాల్గొన్నారు.

సీఎం పుట్టిన రోజు సందర్భంగా 100 మంది పురోహితులతో యాగాలు

సికింద్రాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని కార్ఖాన మహాకాళి దేవాలయ ప్రాంగణంలో ఈనెల 8వ తేదీన 100 మంది పురోహితులతో లక్ష్మీగణపతి యాగం, మృత్యుంజయ యాగం, నవ చండీ యాగం, శత రుద్ర యాగం నిర్వహించనున్నట్టు సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గురువారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, నాయకులు సంకి రవీందర్, తేలుకుంట సతీష్‌గుప్తా తదితరులతో కలిసి ఆలయ ఆవరణలో ఏర్పాట్లను పరిశీలించారు.

క్యాన్సర్ మహమ్మారిని తరిమి కొట్టాలి

అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీనిధి ఎడ్యుకేషనల్ గ్రూప్ ఆధ్వర్యంలో 2(టీ) బీఎన్ ఎన్‌సీసీ సికింద్రాబాద్ సముక్త ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మిలిటరీ ఆసుపత్రి నుంచి లాల్‌బజార్ అంబేడ్కర్ విగ్రహం వరకు జరిగిన ర్యాలీని శ్రీగణేష్ ప్రారంభించారు.

శాస్త్రీనగర్ లో మంచి నీటి సమస్యకు పరిష్కారం

కొంత కాలంగా శాస్త్రీనగర్ లో నెలకొన్న మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ స్థానికులకు హామీ ఇచ్చారు. వారు తీసుకువచ్చిన మంచినీటి సమస్యను కంటోన్మెంట్ బోర్డు మంచినీటి విభాగం అధికారితో అప్పటికప్పుడు మాట్లాడుతూ వీలైనంత తొందరగా సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాలని అధికారులకు సూచించారు.


ప్రీ-ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్ క్యాబిన్లను ప్రారంభిస్తున్న ఎన్‌టీపీసీ అధికారులు

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడం అభినందనీయం: పాణిగ్రహి

పద్మారావునగర్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను క్రీడలలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేలా తీర్చిదిద్దడం అభినందనీయమని ఎన్‌టీపీసీ దక్షిణ ప్రాంత కేంద్ర కార్యాలయ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్).ఎస్ఎన్ పాణిగ్రహి అన్నారు. ఎన్‌టీపీసీ 50వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌సీఎఫ్ సంస్థకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ప్రీ-ఫ్యాబ్రికేటెడ్ పోర్టబుల్ టాయిలెట్స్‌ను అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత అదనపు ముఖ్య కార్యదర్శి ప్రవీణకుమార్,ఎన్‌టీపీసీ అధికారులు హాజరయ్యారు.



ఇటీవల తార్నాక డివిజన్ జలమండలి మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన కుషాల్ కుమార్ గురువారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డిని తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

- తార్నాక, (ఆంధ్రజ్యోతి)

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

రెజిమెంటల్ బజార్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణతో పాటు నేరస్థులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని నార్త్‌జోన్ డీసీపీ రేష్మీ పెరుమాళ్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ పాట్ మార్కెట్‌లో పాట్ మార్కెట్ జువెల్లరీ అసోపసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 48 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవడం వలన నేరాలను నియంత్రించవచ్చన్నారు. సీసీ కెమెరాల నిఘా ఉన్న ప్రాంతాలలో నేరాలు చేయడానికి వెనుకడుగు వేస్తారని తెలిపారు. డీవీఆర్ ఫుటేజీ ఎక్కువ రోజులు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. నార్త్ జోన్ పరిధిలో ఉన్న వారు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకురావాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకుని జాగ్రత్తగా ఉండాలని పాస్‌వర్డు, ఓటీపీ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాకాళి డివిజన్ ఏసీపీ సర్ధార్ సింగ్, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ఎస్సై మమత, పాట్ మార్కెట్ జువెల్లరీ అసోషియేషన్ అధ్యక్షులు శర్మల్ జైన్, ఉపాధ్యక్షులు ఉత్తమ్ చంద్ జైన్, పరాస్మల్ రావల్, ప్రధాన కార్యదర్శి సురేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

యువతలో లీడర్‌షిప్ పెంపొందాలి

- దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్


డైమండ్ జూబ్లీ లోగోను ఆవిష్కరిస్తున్న దక్షిణమధ్యరైల్వే జీఎం, చిత్రంలో రైల్వే ఉన్నతాధికారులు, స్కౌట్స్ అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వ్యవస్థాపక దినోత్సవాన్ని దక్షిణమధ్యరైల్వే ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ లోగోను దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆవిష్కరించారు. జీఎం మాట్లాడుతూ.. స్కౌటింగ్, గైడింగ్ ద్వారా నాయకత్వం, స్వావలంబన, సమాజ సేవ, పర్యావరణం పట్ల అవగాహన తదితర విలువలను యువతలో పెంపొందించవచ్చన్నారు. అనంతరం రైల్వే కాలనీలో నిర్వహించిన వాకథాన్ కార్యక్రమంలో సౌత్ లాలాగూడ రైల్వే హైస్కూల్ విద్యార్థులు, స్కౌట్ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కమిషనర్ జీఆర్ఎస్ రావు, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ సీఎంఎం రావత్, అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, పీసీసీఎం పద్మజ, హైదరాబాద్ డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్ పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్‌జీ ఆవిర్భావ దినోత్సవం

రాంగోపాల్‌పేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (బీఎస్‌జీ) 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని సికింద్రాబాద్ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్, గైడ్ విద్యార్థులకు మార్చ్‌పాస్ట్, చిత్రలేఖనం, హ్యాండీక్రాఫ్ట్ క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించగా ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన వివిధ పాఠశాలల స్కౌట్, గైడ్ విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా మెహర్‌న్నిష్ భరేనా స్కౌటింగ్‌లో 30 సంవత్సరాలు, గైడింగ్‌లో 24 సంవత్సరాల పాటు తమ సేవలను అందించిన ప్రేమలతను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన స్కౌట్స్ జిల్లా కమిషనర్, సికింద్రాబాద్ డిప్యూటీ ఈఓ శ్రీధర్ మాట్లాడుతూ.. స్కౌట్స్, గైడ్స్‌ను సోషల్ సోల్జర్స్‌గా అభివర్ణించారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ కమిషనర్ కేవి దేవదత్, అధ్యక్షుడు డి.మాధవ రావు, కార్యదర్శి రమేష్ చందర్, కోశాధికారి రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బెడెన్ పావెల్, లేడీ బెడెన్ పావెల్‌లకు నివాళులర్పిస్తున్న సికింద్రాబాద్ కార్యవర్గం

స్కందగిరిలో ఆధ్యాత్మికశోభ



కావళ్లను పాల కుండలను ఎత్తుకొని వెళ్తున్న భక్తులు

పద్మారావునగర్, నవంబరు7, (ఆంధ్రజ్యోతి): స్కందగిరి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మికశోభను సంతరించుకొన్నాయి. మహా స్కంద షష్టి మహోత్సవాన్ని పురస్కరించుకొని పద్మారావునగర్ స్కందగిరిలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, ప్రత్యేక హోమంతో పాటు కావడి, పాల్ కుడం (పాలకుండ) వంటి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణ అంతా భక్తులతో కిక్కిరిసి పోయింది. అనంతరం భక్తులు భుజాలపై కావళ్లను, తలపై పాల కుండలను ఎత్తుకొని మేళతాళాల నడుమ భక్తి పారవశ్యంతో నృత్యంచేస్తూ ఆలయం చుట్టూ గిరి ప్రదక్షిణం చేశారు. ఆలయ చైర్మన్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, మేనేజింగ్ ట్రస్టీ క్రిష్ణన్ రాజమణి హాజరయ్యారు.


టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నాయకులు

టీడీపీ సభ్యత్వ నమోదు

సనత్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీపతి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సనత్‌నగర్ స్వామిటాకీస్ వద్ద తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ ఎంఎల్ఏలు బక్కని నర్సింహులు, కాట్రగడ్డ ప్రసూన, పార్లమెంట్ కన్వీనర్ సాయిబాబా పాల్గొని సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు కానూరి జయశ్రీ, రాజేంద్రప్రసాద్, బోనాల తదితరులు పాల్గొన్నారు.